# అసమాన ప్రజ్ఞాశాలి 'మొదలి'

కాచిగూడ, జూలై 24 ప్రభాతవార్త

నాటకరంగ శాస్త్ర బోధకుడుగా, రచయితగా, ప్రయోక్తగా తెలుగు, ఇంగ్లీషు భాషలలో అసమాన ప్రతిభాశాలిగా మొదలి నాగభూషణశర్మ చేసిన సేవలు శ్లాఘనీయమని పలువురు వక్తలు ప్రశంసించారు. తెలుగు నాటకరంగాన్ని ఉద్దీపన చేయడం కోసం బహుముఖంగా ఆయన చేసిన సేవలు భావితరాల వారికి మార్గదర్శకంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. సోమవారం రాత్రి శ్రీత్యాగరాయ గానసభలో రసాంజలి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల ప్రయోక్త, రచయిత ఆచార్య మొదలి నాగభూషణ శర్మ 72వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన రచించిన 'ఆంధయుగం', 'కాయితం పులి' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. ప్రముఖ సినీ,నాటక రచయిత డి.వి.నరసరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో ఆచార్య వకుళాభరణం రామకృష్ణ, ప్రముఖ రంగస్థల ప్రయోక్త చాట్ల శ్రీరాములు, విప్లవ కవి జ్వాలముఖి, దుగ్గిరాల సోమేశ్వరరావు, డాక్టర్ డి.యస్.యన్.మూర్తి, డాక్టర్ అరుణాభిక్షు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నాటక రంగంలో అర్థశతాబ్దానికి పైగా సేవలందించిన మొదలి నాగభూషణశర్మ సమకాలీకంగా కూడా తొలితరం నాటి ఉత్తమ నాటక ప్రదర్శనల కోసం అహరహం పరితపించడం ఆయనకే చెల్లిందని ప్రశంసించారు. పాశ్చాత్య రంగ నాటకాలను తెలుగురంగానికి పరిచయం చేసిన వారిలో అగ్రగణ్యులు మొదలి నాగభూషణశర్మ అని వారు కొనియాడారు. నేటికి రసరంజనిలో కీలకపాత్ర పోషిస్తున్న మొదలి కృషిని వారు అభినందించారు. ఈ సంద ర్భంగా మొదలి సరస్వతి, మొదలి నాగభూషణశర్మల స్వేచ్ఛానుసరణ 'కాయితం పులి' (ప్రయోగాత్మక నాటకం)పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అలాగే అంధయుగం (శ్రీధర్మవీర్ భారతి హిందీలో రాసిన అంధాయుగ్) మొదలి సరస్వతి, మొదలి నాగభూషణశర్మల తెలుగు అనువాద పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అనంతరం సంస్థ పక్షాన అతిథులు మొదలి నాగభూషణశర్మ 72వ జన్మదినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. రసాంజలి సంస్థ వ్యవస్థాపకుడు వై.మల్లికార్జునమ్ సభకు స్వాగతం పలికి నివేదిక సమర్పించారు. అనంతరం బి.పి.ప్రసాద్‌రావు రచన, దర్శకత్వంలో 'నిలువుటద్దం' నాటిక ప్రదర్శితమైంది. బి.పి.ప్రసాదరావు, అనురాధ, సురభి ప్రభావతిలు నిలువుటద్దం నాటికలో పాత్రోచితంగా నటించి నాటకాభిమానుల మెప్పుపొందారు.




శ్రీ త్యాగరాయ గానసభలో మొదలి నాగభూషణం శర్మ రచించిన 'అంధయుగం, కాయితం పులి' నాటక గ్రంథాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో డి.వి.నరసరాజు, చాట్ల శ్రీరాములు, జ్వాలాముఖి తదితరులు